ప్రజాశక్తి
శుక్రవారం 11 ఏప్రిల్ 2025 5 అనంతపురం





రిలేదీక్షల్లో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

వక్ఫ్ సవరణ బిల్లుతో విఘాతం

- ఉపసంహరించేంత వరకు పోరాడాలి
- యూజేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు
- రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావుల మద్దతు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా ఉభయ సభలో ఏకపక్షంగా పాస్ చేయించుకున్న వక్ఫ్ సరవణ బిల్లుతో ముస్లిములకే కాక, రాజ్యాంగానికి తీవ్ర ప్రమాదం అని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు అభిప్రాయ పడ్డారు. వక్ఫ్ బిల్లును ఉప సంహరించుకోవాలని కోరుతూ యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ (యూజేఏసి) ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద రిలే నిరాహార దీక్షలను గురువారం ప్రారంభించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎ.చంద్రశేఖర్, సిటిజన్ ఫోరం నాయకులు, న్యాయవాది అబ్దుల్ రసూల్‌లు దీక్షలను ప్రారంభించారు. వక్ఫ్ బోర్డ్ మాజీ ఛైర్మన్ రిజ్వాన్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి, ఇమామ్ బాషా, వైసిపి కార్పొరేటర్‌లు రహంతుల్లా, దాదు, ఇషాక్, జమాతే ఇస్లామిక్ హింద్ యాసీర్ అహ్మద్, ప్రజా సంఘం నాయకులు జాకీర్, ఇన్సాఫ్ నాయకులు ఖాజా హుస్సేన్, బంగారు బాషాలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వీరి దీక్షలకు నగర మేయర్ వసీం, వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ ఫయాజ్ బాషా, ఉర్దూ అకాడమీ రాష్ట్ర మాజీ ఛైర్మన్ నదీం, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దాదా గాంధీ, వైసిపి మైనార్టీ సెల్ బాకే హబీబుల్లా, ఎస్సీ, ఎస్టీ జేఏసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షులు మహబూబ్‌బాషాలు మద్దతుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ బోర్డు బిల్లును సవరిస్తూ ఉభయ సభల్లో ఆమోదం చేసుకుందన్నారు. వక్ఫ్ ఆస్తులు కార్పొరేట్ సంస్థలకు కొల్లకొట్టే కుట్రల్లో భాగమే చట్ట సవరణ చేస్తున్నారని విమర్శించారు. మతతత్వ విధానాలను రాజ్యాంగంలోకి చొప్పించి ముస్లింల హక్కులను హరించే చర్యలకు పాల్పడడం విచాకరం అన్నారు. వక్ఫ్ బిల్లును తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంతవరకు లౌకికవాదులంతా ఏకమై కేంద్రంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

గోరంట్ల మాధవ్ అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం

హిందూపురం మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌ను గుంటూరు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. చెబ్రోల్ కిరణ్‌పై దాడికి యత్నించారన్న ఉద్దేశంతో అరెస్టు చేశారు. చెబ్రోలు కిరణ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులపై అనుచితంగా మాట్లాడారన్న దానిపై పోలీసులు గురువారం నాడు అరెస్టు అతన్ని అరెస్టు చేశారు. అరెస్టు చేసి తీసుకెళుతున్న సమయంలో ఆయనపై దాడికి గోరంట్ల మాధవ్ ప్రయత్నించినట్టు తెలుస్తోంది. ఆ సమయంలోనే ఆయన్ను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు.

పోలీస్ పొలిటికల్ ఫైట్

- ఆజ్యం పోసిన ఎస్ఐ సుధాకర్ యాదవ్ వ్యాఖ్యలు
- అధికారపార్టీకి పోలీసుల మద్దతంటూ వైసిపి విమర్శలు





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో పోలీసుల పొలిటికల్ ఫైట్ జోరుగా సాగుతోంది. రామగిరి మండల ఎంపిపి ఎన్నిక సమయంలో ప్రారంభమైన ఈ వివాదం అంతకంతకు పెరుగుతూపోతోంది. వైసిపి ఎంపిటిసిలను ప్రలోభపెట్టే ప్రయత్నం రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ చేసారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఈ వివాదం నడుస్తున్న సమయంలో పాపిరెడ్డిపల్లిలో జరిగిన హత్యలో పోలీసులపై ప్రతిపక్ష వైసిపి విమర్శలు మరింతగా పెరిగాయి. వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పోలీసుల తీరును తప్పుబడుతూ, తప్పుచేసిన వారిని చట్టం ముందు బట్టలు ఊడదీసి నిలబెడతామని హెచ్చరించారు. ఈ హెచ్చరికలపై రాజకీయ రచ్చ నడుస్తోంది. అధికార పార్టీ నాయకులు ఏ రకంగా పోలీసుల బట్టలూడదీస్తావంటూ మండి పడుతున్నారు. ఈ వివాదం వారి మధ్య నడుస్తున్న క్రమంలోనే రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ ఏ రకంగా బట్టలూడదీస్తావు జగన్ అంటూ చేసిన వీడియో ఒకటి వైరల్ అయింది. ఆయన వ్యాఖ్యలతో ఈ రాజకీయ దుమారం మరింత ఎక్కువైంది.

పోలీసులపై వ్యాఖ్యలు సరికాదు

త్రిలోక్, పోలీసు అధికారుల సంఘం నాయకులు.

పోలీసుల బట్టలూడదీస్తామని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు సరైనవి కాదని పోలీసుల అధికారుల సంఘం నాయకులు త్రిలోక్ తెలిపారు. జగన్ పర్యటన సందర్భంగా పోలీసు భద్రత కట్టుదిట్టంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎక్కువ మంది వైసిపి శ్రేణులు వచ్చినా ఎక్కడా ఎటువంటి చిన్నపాటి ఘటన చోటు చేసుకోకుండా ఎంతో సమన్వయంతో పనిచేసామన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పనిచేసింది కూడా ఇదే పోలీసులేనని చెప్పారు. విధి నిర్వహణలో నిత్యం కష్ట పడుతున్న పోలీసులను కించ పరిచే విధంగా జగన్ మాట్లాడటం సరైంది కాదని ఆయన తెలిపారు.

నెత్తిన టోపి, డ్రస్ సిగ్గుపడుతోంది

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

సుధాకర్ యాదవ్ ఎంపిపి ఎన్నికల సమయంలో వ్యవహరించిన తీరు చూస్తే నెత్తి మీద టోపి, వేసుకున్న డ్రస్ కూడా సిగ్గుపడుతుందని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విమర్శించారు. పోలీసు వాహనంలో రాళ్లు, కట్టెలు పెట్టుకుని వచ్చింది కాక, వాటిని బాధితుల వాహనాల్లో చూపించి కేసులు నమోదు చేసారని ఆరోపించారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా 1200 మంది భద్రతను ఏర్పాటు చేసామని పోలీసులు అధికారులు చెబుతున్నారన్నారు. వచ్చిన 1200 పోలీసుల్లో సగం మందిని పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద, పాపిరెడ్డిపల్లి గ్రామంలో నిందితుల రక్షణకు పెట్టారని ఆరోపించారు. జగన్‌కు ఏర్పాటు చేయాల్సిన మూడంచెల భద్రతను ఏర్పాటు చేయకపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. భద్రతా సరిగా కల్పించకుండా రోడ్డు మార్గంలో వెళ్లే విధంగా చేసి ఆయనపైన దాడి చేయాలన్నది టిడిపి ఉద్దేశంగా ఉందన్న అనుమానం కలుగుతోందని చెప్పారు.

పారదర్శకంగా మద్యం అమ్మకాలు

- గత ప్రభుత్వ అక్రమాలపై సిట్ దర్యాప్తు
- అక్రమార్కులను ఎవరినీ వదిలిపెట్టం
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- నూతన ఐఎంఎఫ్ఎల్ డిపో గోడౌన్ ప్రారంభం



సోములదొడ్డి వద్ద ఐఎంఎఫ్ఎల్ డిపో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాణ్యమైన మద్యంతో పారదర్శకంగా అమ్మకాలు కొనసాగిస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామంలో రూ.11.10 కోట్లతో నూతనంగా నిర్మించిన ఐఎంఎఫ్ఎల్ డిపో గోడౌన్‌ను గురువారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు, అనంతపురం, మడకశిర, శింగనమల ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎమ్మెస్.రాజు, బండారు శ్రావణి శ్రీ, పొలిటికల్, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా, ఎపిఎస్‌బిసి లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, డిస్టలరీస్, బ్రేవరీస్ కమిషనర్ నిశాంత్ కుమార్ రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి పెద్దపేట వేస్తూ, నాణ్యమైన మద్యం విక్రయాలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా 3500 మద్యం దుకాణాల కేటాయింపు జరిగిందన్నారు. గోడౌన్ నుంచి వెళ్లే ప్రతి స్టాకు వాహనాన్ని ట్రాక్ చేస్తున్నామన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యాన్ని అరికట్టడం ద్వారా రాష్ట్రంలో 30 నుంచి 40 శాతం అమ్మకాలు పెరిగాయన్నారు. మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులను అమలు చేస్తున్నామన్నారు. మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న వారు ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే షాపు లైసెన్సులు రద్దు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కొత్తకొత్త పేర్లతో నాసిరకం మద్యాన్ని సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేసిందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కొనుగోళ్ల అక్రమాలన్నీ వెలికి తీస్తున్నామని చెప్పారు. మద్యం అక్రమాలను నిగ్గుతేల్చడానికి సిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. మద్యం స్కాంలో బాధ్యులైన వారు ఎవరూ తప్పించుకోలేరని చెప్పారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ గోడౌన్‌లో హమాలీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టులో ఉన్న భూ సమస్యను అధికారులు తాము కలిసి పరిష్కరిస్తామన్నారు. మరో ఐదు కోట్లు నిధులు మంజూరు చేస్తే పూర్తిస్థాయి గోడౌన్ తయారవుతుందన్నారు. అనంతరం మంత్రికి పరిటాల సునీత జ్ఞాపికలను బహుకరించారు. గోడౌన్ హమాలీలకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ అనసూయ దేవి, ఎపిఎస్‌బి లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రవణ్ కుమార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునుస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.రామ్మోహన్ రెడ్డి, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

- బొమ్మనహాల్‌లో నేలకొరిగిన వరిపంట
- పెనకచెర్లలో పిడుగుపాటుకు 10 గొర్రెలు మృతి



బొమ్మనహాల్ మండలంలో నేలకొరిగిన వరిపంట

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లాలోని పలు మండలాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కూడేరు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, బొమ్మనహాల్ మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామంలో పిడుగుపాటుతో పది గొర్రెలు మరణించాయి. బొమ్మనహాల్‌లో వరి, రాయదుర్గం మండలంలో మొక్కజొన్న పంటలు ఈదురుగాలులకు నేలవాలాయి.

పిడుగు పాటుతో 10 గొర్రెల మతి

గార్లదిన్నె : మండల పరిధిలోని పెనకచెర్ల గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగు పడి పది గొర్రెలు మరణించాయి. చిదంబరప్ప, సుబ్బరాయుడుకు చెందిన గొర్రెలను ఎస్సీ కాలనీ వద్ద మేపుతున్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఇదే సమయంలో పిడుగు పడడంతో అక్కడే ఉన్న పది గొర్రెలు మరణించాయి. దాదాపు రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని కాపరులు ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెలు మరణించిన విషయం తెలుసుకున్న పశు వైద్యాధికారులు డాక్టర్ రమేష్, ఆంజనేయులు నాయక్ గ్రామానికి వెళ్లి పరిశీలించారు. నష్టం నివేదికను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు.

నేలకొరిగిన వరిపంట

బొమ్మనహాల్ : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి కురిసన వర్షానికి వరిపంట నేలకొరిగింది. గోవిందవాడ, శ్రీధర్‌గట్ట, గోనెహాల్, లింగదహాల్, కొలగనల్లి, మైలాపురం ఉద్దేహాల్ గ్రామాల్లో వరిపంట నేలవాలింది. చేతికందే సమయంలో పంట మొత్తం ఇలా దెబ్బదినడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.



పెనకచెర్ల గ్రామంలో పిడుగుపాటుతో మరణించిన గొర్రెలు

మొక్కజొన్న రైతుకు నష్టం

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని రాయంపల్లి, కదరంపల్లి, ఆవులదట్ల గ్రామాల్లో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఈదురుగాల దెబ్బకు ఈ గ్రామంలోని మొక్కజొన్న కంకులు నేలవాలాయి.



గడ్డితిని నిరసన తెలుపుతున్న శ్రీరామిరెడ్డి కార్మికులు

గడ్డితిని బతకాలా..?

శ్రీరామిరెడ్డి కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే గడ్డితిని బతకాలా అంటూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు అధికారులు, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా గురువారం ఉదయం కళ్యాణదుర్గం శ్రీరామిరెడ్డి తాగునీటి పంప్‌హౌస్ వద్ద కార్మికులు పచ్చిగడ్డి తింటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ వేతనాల కోసం కార్మికులు సమ్మె చేపట్టి ఐదు రోజులు కావస్తున్నా అధికారుల్లో చలనం రావడం లేదన్నారు. వేతనాల కోసం ప్రతి నెలా కార్మికులు సమ్మె చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం కార్మికుల పట్ల కనకరం లేకుండా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు అందక కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఉందన్నారు. నిత్యం ఈ సమస్యపై పోరాటం చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే పెండింగ్ వేతనాలన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రంగనాథ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు భవిత్, శ్రీరామిరెడ్డి యూనియన్ నాయకులు వన్నూరు స్వామి, పి.నరేష్, అల్లాబకాస్, చిత్తప్ప, గురుమూర్తి, జి.వెంకటేశులు, మురళి పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక చైతన్యయాత్రలు

జ్యోతిబా పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో సామాజిక న్యాయాన్ని సాధించుకుందాం - ఐద్వా, కెవిపిఎస్ నేతలు సావిత్రి, వెంకటేష్



విలేకరులతో మాట్లాడుతున్న ఐద్వా, కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహాత్మా జ్యోతిబా పూలే, బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌లు కలలుగన్న సామాజిక న్యాయం, సమసమాజాన్ని సాధించుకోవడానికి మహనీయులను స్మరించుకోవడంతో పాటు చైతన్యం పొందుదామని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి తెలిపారు. గురువారం సంయుక్త సంఘాల ఆధ్వర్యంలో గణేనాయక్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయులను స్మరించుకుని వారి ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం సాధించుకోవాలన్నారు. అందులో భాగంగా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నాడు అనంతపురం జిల్లా పరిషత్ హాల్ నుంచి సామాజిక చైతన్య యాత్రను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రారంభ సభకు ఎస్‌కెయు ప్రొఫెసర్ లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి జాతను ప్రారంభిస్తారని తెలిపారు. 14న సాయంత్రం ఐదు గంటలకు అంబేద్కర్ నగర్, నాగుల కట్ట హై స్కూల్ దగ్గర బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళిత, గిరిజన కాలనీల్లో సదుపాయాలు కల్పించాలన్నారు. భూమి లేని వారికి కనీసం మూడు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వమే నడపాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్లో కనీస సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జీవ, ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత, ఐద్వా జిల్లా కోశాధికారి చంద్రిక, అశ్విని పాల్గొన్నారు.

మెయిన్స్ నిర్వహణపై నిర్లక్ష్యం తగదు

డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్

ప్రజాశక్తి-గుంతకల్లు

కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు అన్నారు. గురువారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో 2022లో నోటిఫికేషన్ ఇచ్చి మూడేళ్లు అవుతున్నా ఇంతవరకు కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయలేదన్నారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు కోర్టు కేసులు క్లియర్ చేసి పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఖాళీల భర్తీ చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి సుప్రీంకోర్టులో ఉన్న కేసులు పరిష్కరించి పాత పద్ధతిలో రిజర్వేషన్ ద్వారా అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు తేదీని ప్రకటించాలన్నారు. లేనిపక్షంలో నిరుద్యోగ యువతను ఐక్యంచేసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని.. అవసరమైతే చలో విజయవాడకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు శివ, చంద్ర, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

సామాజిక బాధ్యతతో విధులు నిర్వర్తించాలి : విప్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతతో విధులు నిర్వహించాలని విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. గురువారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో పాఠశాల విద్యా వ్యవస్థ పునర్నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాఉతూ ప్రభుత్వ ఉపాధ్యాయులపై సామాజిక బాధ్యత ఎంతో ఉందన్నారు. అందుబాటులో ఉన్న వసతులను సద్వినియోగం చేసుకుంటూనే విద్య వ్యవస్థను మెరుగుపర్చుకోవాల్సి ఉందన్నారు. ఉపాధ్యాయులపై తమ ప్రభుత్వనికి అపారమైన గౌరవం ఉందని గుర్తుచేశారు. ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా ఓ కుటుంబ వాతావరణంలో నడవాల్సి ఉందన్నారు. అప్పుడే ఉన్నత ప్రమాణాల సాధన దిశగా పయనించే అవకాశం ఉందని వివరించారు. ఎంతో క్లిష్టతరమైన పోటీ పరీక్షల్లో ప్రభుత్వ ఉద్యోగం సాదించారంటేనే మీలో ఎంతో ప్రతిభ దాగుందని రుజువైందన్నారు. అంతటి ప్రతిభాపాటవాలు కలిగిన ఉపాధ్యాయుల చేతుల్లోనే రేపటి పౌరుల బంగారు భవిష్యత్ ఆధారపడిందన్నారు. కాగా మానవసేవనే పరమావధిగా భావించిన ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫెర్రర్ ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని సమజాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, ఎంపిడిఒ కొండన్న, టీచర్లు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా హోమియోపతి వైద్యులు శ్రీనివాసులు, ఝాన్సీలక్ష్మి కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, ఐద్వా నాయకురాలు కవిత, డివైఎఫ్ఐ నాయకులు అశోక్, ప్రశాంత్, కాలనీవాసులు లక్ష్మీదేవి, ప్రమీల,అరుణ, సుజాత,గంగా,తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి : పీడీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల వ్యాప్తంగా ఉపాధి హామీ చట్టంలో కూలీల సంఖ్య పెంచాలని ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా సూచించారు. గురువారం మండల పరిధిలోని లింగదహాల్, కొళగానహళ్లి, గోవిందవాడ, బొల్లనగుడ్డం, నేమకల్లు, తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పండ్లతోటల పెంపకాన్ని పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సంబంధించిన పనులు లేవన్నారు. కావున ఉపాధి హామీ చట్టం కింద ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. ముఖ్యంగా ఫారంపాండ్ పనులు చేపట్టాలన్నారు. ఫారంపాండ్ల వల్ల వర్షాకాలంలో నీరు చేరి భూమిలోకి ఇంకుతుందన్నారు. తద్వారా భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం కూలీలకు రావాల్సిన కూలి డబ్బులు త్వరలోనే విడుదల కానున్నట్లు వివరించారు. కాగా రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాయదుర్గం నాగేశ్వరరావు, ఎంపిడిఒ విజయభాస్కర్, పంచాయతీరాజ్ ఇంజినీర్ జగదీష్, ఎన్ఆర్జిఎస్ స్టాఫ్ నాగేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు 'కియా' చేయూత

ప్రజాశక్తి-ఉరవకొండ


మంత్రినిసన్మానిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతో మండల పరిధిలోని చిన్నముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు కియా ఇండియా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం కింద రూ.40 లక్షల విలువజేసే పరికరాలు, యంత్రాలను అందించేందుకు ఒప్పందం కుదిరింది. ఈమేరకు గురువారం కియా కంపెనీలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.ఆశ్రఫ్ అలీ, కియా ఇండియా కంపెనీ ప్రతినిధులతో కంపెనీ ఉన్నత సలహాదారుడు యోన్గిల్ మా, సిఎస్ఆర్ అధికార ప్రతినిధులు జి.రవిశంకర్రెడ్డి, పి.వీరేంద్ర సమక్షంలో ఎంఒయు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.ఆశ్రఫ్ అలీ, ట్రిపుల్ ఇఇఇ విభాగాధిపతి వై.సురేష్ బాబు, జనరల్ సెక్షన్ శాఖాధిపతి వి.నరసింహారెడ్డి తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర,ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతో పాలిటెక్నిక్ కళాశాలకు విలువైన ప్రయోగశాల పరికరాలు, యంత్రాలు సమకూరనున్నాయన్నారు. మంత్రితోపాటు కియా ఇండియా కంపెనీకి ప్రిన్సిపాల్తో పాటు కళాశాల బృందం కృతజ్ఞతలు తెలిపారు.

రహదారులపై అడ్డుగోడలు తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని ఆర్అండ్బి కూడలి నుంచి పోటర్ లైన్ వరకూ రైల్వే ప్రాంతంలోకి వెళ్లే దారులకు అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఆర్అర్ బి కూడలి నుండి పోటర్ లైను వరకు గతంలో మున్సిపాలిటీ రోడ్లకు రైల్వే రోడ్లు అనుసంధానంగా ఉండేవన్నారు. దీంతో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికుల రాకపోకలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేదన్నారు. అయితే ఈ మధ్యకాలంలో రైల్వే స్థలాల్లోని రహదారులను రైల్వే అధికారులు గోడలు నిర్మించారన్నారు. దీంతో రైల్వే ప్రాంతంలో ఉన్న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, రైల్వేస్టేషన్కు వెళ్లే ప్రయాణికులు, ఉద్యోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున వారిని దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు గోడలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి శ్రీనివాసులు పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ పట్టణ కార్యవర్గ సభ్యులు కసాపురం రమేష్, సురేంద్ర, పట్టణ కమిటీ సభ్యులు షాషా, ఖాదర్, రాము, మక్బూల్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటిలో 'ప్రాజెక్ట్ ఎక్స్పో-2025'

ప్రజాశక్తి-శింగనమల


విద్యార్థుల ప్రాజెక్టులను తిలకిస్తున్న అతిథులు

బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రోటరీపురం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటి) ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రాజెక్ట్ ఎక్స్పో-2025 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 40కిపైగా ప్రాజెక్ట్ మోడల్స్ను విద్యార్థులు ప్రదర్శించారు. డేటా సైన్స్కి సంబంధించి సేల్స్ ఫోర్కాస్టింగ్, లోన్ ప్రిడిక్షన్, బీమా ప్రిడిక్షన్, క్రైమ్ డేటా ఎనాలిసిస్ వంటివి మెషిన్ లెర్నింగ్కి సంబంధించిన ఫేక్ న్యూస్ డిటెక్షన్, ఇమేజ్ క్లాసిఫికేషన్, మెడికల్ ఇమేజ్ డయాగ్నోసిస్ వంటివి ఆకట్టుకున్నాయి. ఈ ఎక్స్పోకి అంజనేయులు, రఘుబాబు, హరిచందన, సునీత, నరసింహులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఎం.రంజిత్రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐక్యూఎసి డైరెక్టర్ డి.సాయిచైతన్య కిషోర్, సిఎస్ఇ, సిఎస్ఎం విభాగాధిపతి పి.చిత్రలింగప్ప, ఐఐఐ సెల్ కోఆర్డినేటర్ హేమంత్కుమార్, సమన్వయకర్తలు కె.వెంకటేష్, కిరణ్కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-గార్లదిన్నె


ఎరువుల వినియోగం పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులు భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టి పరీక్షల ఆధారంగా 'ఎరువుల యాజమాన్య పద్ధతులు ఏ విధంగా పాటించాలి' అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ శాఖలో భూసార పరీక్షల కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఆరుతడి పంటలకు మూడేళ్లు ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే ఈ మట్టి పరీక్షల కోసం మట్టి నమూనాలను ఏ విధంగా సేకరించాలి, ఎక్కడ సేకరించకూడదు, మట్టి నమూనాలు సేకరించడం లో ఏ జాగ్రత్తలు పాటించాలి మొదలగు విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ.వి.ప్రవల్లిక, ఎంపిఇఒ లలిత, రైతులు పాల్గొన్నారు.

గ్రామసభలు సమస్యల పరిష్కార వేదికలు

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కె.అల్తాఫ్

ప్రజాశక్తి-అనంతపురం



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు

గ్రామసభల వేదికలు పౌరుల సమస్యల పరిష్కారానికి దీపికలు అని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కె.అల్తాఫ్ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం నగర సమీపంలోని పాపంపేట సచివాలయం పరిధిలో గ్రామసభలపై ఇంటింటి ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి మూలస్తంభాలన్నారు. అలాంటి గ్రామసభల్లో ప్రజలు స్థానిక, వ్యక్తిగత సమస్యలపై చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివుడు, జిల్లా నాయకులు కె.సుబ్బరాయుడు, టివి రెడ్డి, సదాశివ, ఈశ్వరయ్య, కెవిఎస్ ప్రసాద్, తిరుపాలు, చాంద్బాషా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



పోలీసు పిల్లలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ పి.జగదీష్

పోలీసు పిల్లలకు మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందించడమే జిల్లా పోలీసుశాఖ లక్ష్యమని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. గురువారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ రక్షక్ ప్రీ - ప్రైమరీ స్కూల్ 3వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రయివేట్ పాఠశాలల కంటే మెరుగ్గా ఇక్కడ పాఠశాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. విద్యతో పాటు సౌకర్యాలు కూడా మెరుగ్గానే ఉన్నాయన్నారు. ఆర్డీటీ వారి సహకారంతో స్పానిష్ లాంగ్వేజ్ కూడా అదనంగా పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. చిన్న వయస్సులో అయితే మంచిగా నేర్చుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకునే వీలుంటుందన్నారు. చదువులతో పాటు పిల్లలకు ఆటలు ముఖ్యమన్నారు. బాల్యం నుండే చదువుతో పాటు క్రీడలు, ఆటలకు అలవాటు పడేలా ఇటు ఉపాధ్యాయులు, అటు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు డివి రమణమూర్తి, ఇలియాజ్బాషా (ఎఆర్), డీఎస్పీలు వెంకటేశులు, రవిబాబు, శ్రీనివాస్, నీలకంఠేశ్వరరెడ్డి (ఎఆర్), సిఐలు ధరణీకిశోర్, క్రాంతికుమార్, డిస్కవరి అనంతపురం సంస్థ నిర్వాహకులు అనిల్, దేవానంద్, ఆర్ఐలు పవన్కుమార్, మధు, రాముడు, జిలాలా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మినారాయణ, పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యంపై అవగాహన కల్పించాలి

వైద్యులు కుమారయ్య, తిరుపతినాయుడు

ప్రజాశక్తి-అనంతపురం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ప్రపంచ మానవాళికి దుష్ప్రభావం లేని నమ్మకమైన వైద్యం అయిన హోమియో వైద్యంపై అవగాహన కల్పించాలని వైద్యులు పోగుల కుమారయ్య, నల్లపాటి తిరుపతినాయుడు సూచించారు. గురువారం నగరంలోని సప్తగిరి సర్కిల్లో ఉన్న బళ్లా కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్రీయ మెడికల్ ఆయుష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోమియో వైద్యాన్ని కనుగొన్న డాక్టర్ హనెమాన్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని హోమియోపతి వైద్య విధానాన్ని కనుగొన్న డాక్టర్ హనెమాన్ సేవలు మరువలేనివన్నారు. హోమియోపతి నమ్మకమైన వైద్యం అన్నారు. కావున వైద్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం విశిష్ట అతిథులు డాక్టర్ వీరబోయిన నాగేశ్వరరావు, రామ, డాక్టర్ శాంతిప్రియను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎన్ఎఎన్.మాలిక్, పోగుల నాగేంద్రబాబు, శ్రీనివాసనాయక్, చంద్రమౌళి, మురళీకృష్ణ, షేక్షావలి, నరసింగరావు, వీక్షిత, వేణుగోపాల్, నజీమ్, వనిత, ఆనంద్, మమత, హర్షప్రసాద్, నాగరాజు, అమృత, సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షులు, రమణ, ప్రణవ లీల, రాజ్యలక్ష్మమ్మ, పరుచూరి సూర్యప్రకాశరావు, పీజీ నాగభూషణం, సూర్యనారాయణ, మారుతి, రామసుబ్బన్న, కోటిరెడ్డి, అల్లాబకాస్, సద్గురు పీఠం సేవా కేంద్రం సభ్యులు నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్స్ను వినియోగించుకోండి

జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం


డ్రోన్స్పై అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

వ్యవసాయ శాఖ రైతులకు రాయితీపై అందిస్తున్న కిసాన్ డ్రోన్స్ను వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ పిలుపునిచ్చారు. గురువారం బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలో కిసాన్ డ్రోన్స్పై జిల్లాస్థాయి వర్క్షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆర్కెవివై 2024-25కి సంబంధించిన 35 కిసాన్ డ్రోన్ సిహెచ్సి గ్రూప్ 80 శాతం రాయితీ, లేదా రూ.8లక్షలతో టార్గెట్ ఇచ్చినట్లు తెలిపారు. ఇందుకోసం ఇప్పటి వరకూ 35 గ్రూప్లు ఎంపిక చేయగా డ్రోన్ పైలెట్ సంబంధించిన వారిని కూడా ఎంపిక చేసుకున్నట్లు వివరించారు. 8 మంది డ్రోన్ పైలెట్స్కు శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలిపారు. ఎంపిక చేసిన కిసాన్ డ్రోన్స్ సిహెచ్సి గ్రూపులకు జాతీయ గుర్తింపు పొందిన బ్యాంకుల ద్వారా 50శాతంలోన్ ఇస్తున్నట్లు తెలిపారు. మనకు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం డ్రాగో డ్రోన్ కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్ డ్రోన్ విలువ రూ.9.80 లక్షలు కాగా ముందుగా రైతు 50 శాతం గ్రూప్ అకౌంట్లో జమ చేస్తారన్నారు. మిగిలిన 50 శాతం బ్యాంకులోన్ ద్వారా డ్రోన్ కంపెనీకి చెల్లించాలన్నారు. డ్రోన్ ఇచ్చిన జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి ఇటలైజేషన్ సర్టిఫికెట్లు పంపించిన తర్వాత గ్రూప్ అకౌంట్లో 80శాతం రాయతి జమ అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఓ బి.నర్సింగ్ రావు, జిల్లా ట్రైబల్ డెవలప్మెంట్ ఆఫీసర్ రామాంజనేయులు, ఎపి ఆగ్రోస్ జిల్లా మేనేజర్ ఓబుళపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో భద్రతా సర్క్యులర్ను అమలు చేయాలి

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి-గుత్తి


గుత్తిలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగుల భద్రతా సర్క్యులర్ను అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువరాం గుత్తి ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయు ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపాలన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలన్నారు.ఇహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థనే వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాయదుర్గంలోని ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గేట్ మీటింగ్, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షులు షఫీ, రాయదుర్గం డిపో కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత ఉత్తర్వులు యథావిధిగా అమలు చేయాలని, పాత వైద్య విధానం అమలు, మహిళా కండక్టర్లు, గ్యారేజీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే అక్రమ సస్పెన్షన్లు ఆపాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులు కల్పించాలని, ఆన్ కాల్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ తరపున వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ వైస్ఛైర్మన్ దామోదర్, రీజినల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవినాయక్, డిపో అధ్యక్షులు జిలాన్, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు దూద్ పేరా, సతీష్ కుమార్, పలువురు కార్మికులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతాం : విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్


ప్రజాదర్బార్లో వినతులు స్వీకరిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతామని విప్ కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. గురువారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేదలు, బడుగు, బలహీన వర్గాలు అభ్యున్నతికి అత్యంత ప్రాధ్యాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై మరింత బాధ్యతా యుతంగా శ్రమిస్తోందన్నారు. ప్రతి సోమవారం అన్ని శాఖల అధికారులతో ఫిర్యాదుల దినోత్సవం నిర్వహిస్తుండగా ప్రజాప్రతినిధులు కూడా వారానికి ఒకసారి ప్రత్యేకంగా ఫిర్యాదుదారుల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించే కార్యక్రమం రూపొందించారన్నారు. ప్రభుత్వం తమ సమస్యలపై వెనువెంటనే స్పందిస్తుందన్న విశ్వాసంతో ప్రజలు విరివిగా అర్జీలు సమర్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ కొండన్న, వివిధ శాఖలకు చెందిన అధికారులు, టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు లచ్చన్న, సోమశేఖర్, సుంకన్న, నాదే అలీ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విద్యా బోధకురాలు పర్వీన్

ప్రజాశక్తి-శింగనమల

బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిహెచ్సి డాక్టర్ శంకర్నాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని వెస్ట్ నరసాపురంలో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుక్త వయస్సు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. అలాకాకుండా బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. అలాగే కొంతమంది భ్రూణహత్యలకు పాల్పడుతున్నారన్నారు. పిండ లింగ నిర్ధారణ నిరోధక చట్టం కింద భ్రూణహత్యలకు పాల్పడిచే శిక్షార్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ ప్రసాద్, ఆరోగ్య విద్యా బోధకురాలు పర్వీన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గంగాధర్, హెల్త్ సూపర్వైజర్లు అశ్వర్థ నారాయణ, నాగమ్మ, హెల్త్ ప్రొవైడర్ వరలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు రమణయ్య, గీత, సెక్రటరీ మహాలక్ష్మి, మహిళా పోలీస్ దీప్తి, అంగన్వాడి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి నివాసానికి మంత్రి కొల్లు


మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా పర్యటనకు వచిచ్చన ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం అనంతపురంలోని ఎమ్మెల్యే దగ్గుపాటి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గజమాలతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం అల్పాహారం చేశారు. మంత్రితోపాటు ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, బండారు శ్రావణి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, తదితరులు రావడంతో సందడి వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ గౌస్మోదీన్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యల్లనూరు : గుత్తి 220 కెవి విద్యుత్ కేంద్రం నుంచి తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు తదితర మండలాలకు సరఫరా అవుతున్న విద్యుత్లో స్వల్ప అంతరాయం ఉంటుందని విద్యుత్ ఎఇ రవీంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుత్తి 220 కెవి విద్యుత్ కేంద్రంలో బ్రేకర్స్ మార్పు చేస్తున్నందున యల్లనూరు మండలంలో ఉదయం 3 నుంచి 9 గంటల వరకూ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే శనివారం కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

జాతీయ సర్వే దినోత్సవం

నార్పల : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం జాతీయ సర్వే దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అరుణకుమారి సర్వే దినోత్సవ వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ బ్రహ్మానంద, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసుమూర్తి, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ నిరోషా, మండలంలోని సర్వేయర్లు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం ఇవ్వాలని డిమాండ్

బొమ్మనహాల్ : పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయాలని సిఐటియు నాయకులు ఓబులేసు, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. కావున రాష్ట్రంలో కూడా కూటమి ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పంపిణీచేయాలని డిమాండ్ చేశారు. బియ్యంతోపాటు రాగులు సరఫరా చేయాలన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన భరత్కుమార్

పామిడి : ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి పామిడి మండల కేంద్రంలో చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పి.భరత్కుమార్ (40) మండల కేంద్రంలోని నారాయణస్వామి వీధిలో కరెంటు వర్కర్గా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే భరత్కుమార్ మద్యానికి బానిస అయ్యాడు. ఈనేపథ్యంలోనే బుధవారం రాత్రి భార్యతో గొడవ పడిన భరత్కుమార్ తన ఇంటిపైన ఉన్న గదిలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. అయితే ఎంత సేపటికీ కిందికి రాకపోగా ఇంట్లోవారు పైకి వెళ్లి చూడగా తలుపులు వేసుకుని ఉండటం గమనించి కిటికీలో చూడగా ఉరేసుకున్నట్లు చూశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న వైసిపి పట్టణ కన్వీనర్ నాగూరు ఈశ్వర్రెడ్డి, తదితరులు మార్చురీకి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.

కూలిన మిద్దె పైకప్పు..ఇద్దరికి గాయాలు


కూలిన ఇల్లు

పామిడి : మండలంలోని కొండాపురం గ్రామంలో గురువారం తెల్లవారుజామున పాతమిద్దె కూలి ఇద్దరు గాయపడినట్లు తహశీల్దార్ శ్రీధర్మూర్తి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కొండాపురం గ్రామానికి చెందిన లక్ష్మీ, భర్త కృష్ణయ్య తన కూతురు హారికతో కలిసి పాత తీర్ల మిద్దెలో నివాసం ఉంటున్నారు. ఈనేపథ్యంలో తెల్లవారుజామున ఒక్కసారిగా ఇంటి పైకప్పు కూలింది. గమనించిన చుట్టు పక్కల వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చేలోపు ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులను బయటకు తీసి పామిడి ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని బెంగళూరు వాసి మృతి

పెద్దవడుగూరు : బెంగళూరుకు చెందిన మహేష్కుమార్ (47)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందిన ఘటన గురువారం పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం సమీపంలో 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. విహారయాత్రలో భాగంగా బెంగళూరుకు చెందిన మహేష్కుమార్ స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంలో సిక్కం రాష్ట్రంలో పర్యటించారు. అనంతరం వాహనంలో ఇంటికి తిరుగు వెళ్తుండగా గురువారం గుత్తి అనంతపురం సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లడంతో మహేష్కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య తనూజ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరుపై ఆరాతీశారు. వెనుక నుంచి మరో వాహనం ఢీకొనడం వల్లే మహేష్ మృతిచెందాడని అతని సోదరుడు సోమశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భర్తను కడతేర్చిన భార్యకు జీవితఖైదు

అనంతపురం క్రైం : భర్తను హత్య చేసిన కేసులో భార్యకు జీవిత ఖైదు తో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువడింది. వివరాల మేరకు.. యల్లనూరు మండలం శింగవరం గ్రామానికి చెందినబత్తిని సుమకుమారిని సుమారు 17ఏళ్ల కిందట స్థానిక అశోక్నగర్కు చెందిన రాజేంద్రప్రసాద్కు ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అయితే భార్య అక్రమ సంబంధం భర కు తెలిసి మందలించాడు. ఈనేపథ్యంలో భర్తను అడ్డు తొలగించుకునేందుకు 02.11.2021వతేదీ రాత్రి ఇంట్లో బత్తిని సుమకుమారి తన భర్తను రోకలిబండతో కొట్టి చంపింది. హతుని అన్న విజయ్ కుమార్ ఫిర్యాదు ధమేరకు 02.11.2021 అప్పటి అనంతపురం1 టౌన్ సీఐ ప్రతాప్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతపురం అడిషనల్ 7 వ సెషన్స్ జడ్జి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈకేసులో జడ్జి హరిత గారు 15 మంది సాక్షులను విచారించి నేరం రుజువైనందున గురువారం ముద్దాయికు జీవిత ఖైదు, జైలు శిక్ష రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును పిపి నాగరాజ బాబు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ వెంకటేష్ నాయక్, అనంతపురం వన్ టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎఎస్ఐ సునీల్కుమార్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుళ్లు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచి, నిందితులకు శిక్ష పడేందుకు తమ వంతు కృషి చేశారు. వీరందర్నీ జిల్లా ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో చందన గేటు వద్ద గురువారం టిప్పర్ ఢీకొన్న ఘటనలో మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిక్కేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి పెద్దవడుగూరు మండలం రావులుడికి గ్రామంలో చెన్నమయ్య స్వామి తిరుణాలకు వెళ్లి వస్తుండగా చందన గేటు సమీపంలో ఆటో దిగి ఆర్టీసీ బస్సు ఎక్కబోయి టిప్పర్ కింద పడింది. దీంతో లక్ష్మీదేవి చెయ్యి తెగిపోయింది. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గర్భిణులకు వైద్యపరీక్షలు

యల్లనూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు లోకేష్‌కుమార్, శివసాయి కలిసి దాదాపు 48 మందికి రక్తహీనత, బిపి, షగర్, తదితర పరీక్షలు చేశారు. గర్భిణులకు ఆసుపత్రిలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ మధుకు మార్, సూపర్‌వైజర్ హాజీవలి, జైమాబి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేత కార్మిక సంఘం వార్షికోత్సవం

యాడికి : మండల కేంద్రంలోని వెంగమ నాయుడు కాలనీలో చేనేత కార్మిక సంఘం 90వ వార్షికోత్సవ వేడుకలను చేనేత కార్మికులు, కాలనీవాసులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పామిశెట్టి గోవిందు, జిల్లా సహాయ కార్యదర్శి గుండా శ్రీనివాసులు, సిపిఐ పట్టణ కార్యదర్శి కుళ్లాయిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, పుట్లూరు నరసింహులు వెంకటస్వామి, ఆంజనేయులు, చేనేత కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

రైతుల ఇకెవైసి గడువు పొడిగింపు

గుంతకల్లు రూరల్ : రైతుల పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ అనుసంధానం, ఇకెవైసి చేయించుకునేందుకు ఈనెలాఖరు వరకూ గడువు పొడిగించినట్లు తహశీల్దార్ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, పట్టణ పరిధిలో దాదాపు 11వేల మంది రైతులు ఇకెవైసి చేయించుకోవాల్సిన ఉందన్నారు. వీరందరి జాబితాను ఆయా రేషన్ దుకాణాలకు అందజేసినట్లు తెలిపారు. కావున వీరందరూ ఈనెలాఖరు లోపు ఇకెవైసి చేయించుకోవాలని కోరారు.

ముస్లిముల నిరసన ర్యాలీ

యాడికి : వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా మండలంలోని ముస్లిములు గురువారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా బస్టాండ్ కూడలిలోని మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం పురవీధుల గుండా బైకు ర్యాలీగా తాడిపత్రిలోని సిద్ధి బాషా దర్గా వద్ద ముస్లిములు చేపట్టిన రిలే దీక్షల వద్దకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు జూటూరు రబ్బాని, చాంద్‌బాషా, సలీంబాషా, స్టార్ ఎలక్ట్రికల్ షరీఫ్, సులేమాన్, సెల్ పాయింట్ హాజీ మస్తాన్, ఫిరోజ్‌బాషా, అచ్చుకట్ల బాషా, హాజీవలి, కోటవీధి షేక్ష, జాఫర్, పఠాన్ ఫారూఖ్, మొహమ్మద్, మిడుతురు షాను, చికెన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

గుత్తి : 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎపి ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.ఉషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో 20వ తేదీ ప్రవేశ పరీక్ష ఉండగా ఈస్టర్ పర్వదిన సందర్భంగా మరుసటి రోజు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గమనించాలని కోరారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యకు డిమాండ్

గుత్తి : ముందస్తు అడ్మిషన్లు చేపట్టిన ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గం అధ్యక్షుడు వి.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంఇఒ బి.రవినాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎఐఎస్ఎఫ్ నాయకులు మధు, తన్వీర్, సమీర్, ఆఫీజు, వెంకటసాయి, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-నార్పల

అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పోషకాహారంపై సిడిపిఒ భారతి ఆదేశాల మేరకు గురువారం మండలం కేంద్రంలోని చింతవనం-2 అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునాలిని, అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి, సహాయకురాలు ప్రమీల, తల్లులు పాల్గొన్నారు.

శింగనమల : పౌష్టికాహారంతోనే పుట్టబోయే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని పెరవలి అంగన్వాడి కేంద్రంలో పోషణ ఆహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బాలింతలు, చిన్నారులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి పౌష్టికాహారంపై అవగాహన కలింపచారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రమణమ్మ, ప్రసన్నరాణి, హెల్పర్లు అరుణ, ఏఎన్ఎంలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శాంతమ్మ సూచించారు. గురువారం మండలం పుట్లూరు సెక్టార్ నాయకునిపల్లిలో పోషణ పక్వాడ్ కార్యక్రమంపై అవగాహన కలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.



శింగనమలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడీలు



పామిడిలో అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

పామిడి : మండలంలోని పాళ్యంలో ఉన్న అంగన్వాడీ సెంటర్‌లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ అధ్యక్షతన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌జర్ గర్భవతిగా నిర్ధారణ అయినప్పటి నుంచి బిడ్డ పుట్టి రెండేళ్లు నిండేంత వరకూ వెయ్యిరోజులపాటు పిల్లలకు మంచి పౌష్టికాహారం, సంరక్షణ పట్ల గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు సువర్ణ, జయలక్ష్మి, గర్భిణులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కంటే హత్యా రాజకీయాలపైనే ఎక్కువ చర్చ



మాట్లాడుతున్న పోతుల నాగరాజు

అనంతపురం సిటీ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కంటే హత్యా రాజకీయాలపైనే ఎక్కువ చర్చ నడుస్తోందని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్) వ్యవస్థాపకులు పోతుల నాగరాజు అన్నారు. గురువారం తన గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలోని బీసీ ప్రజలు దయ చేసి హత్యా రాజకీయాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఎందుకంటే హత్యా రాజకీయాలకు వెళ్తే మీతోపాటు పిల్లల భవిష్యత్తు నాశనం అవుతందన్నారు. అలాగే హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబానికి అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు కలిసి రూ.కోటి పరిహారం డిమాండ్ చేశారు.

పుస్తకాలు పంపిణీ



ప్రభుత్వ పుస్తకాలతో విద్యార్థినులు

ఉరవకొండ : ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఇంటర్ బోర్డు సరఫరా చేస్తున్న పుస్తకాలను గురువారం స్థానిక బాలికల కళాశాలలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మమత మాట్లాడుతూ విద్యార్థులు అందరూ తప్పకుండా కళాశాలకు వచ్చి ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని కోరారు. వేసవి సెలవుల్లో పుస్తకాలు చదవడం, సబ్జెక్ట్‌లపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

ఉరవకొండ : గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారిణి పావని సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, స్టాఫ్‌నర్సులు జినాతున్నీసా, సునీత, సిహెచ్‌ఒ భవాని, హిమబిందు, నాగసురేఖ, హెబ్సిబా, రూపా, తదితరులు పాల్గొన్నారు.

ఫైరింగ్ పోటీలకు ఎంపిక

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు ఎన్‌సిసి క్యాడెట్లు ఇటీవల బ్రాహ్మణపల్లిలో జరిగిన ఫైరింగ్ (తుపాకీతో గురి చూసి కొట్టడం) పోటీల్లో అర్హత సాధించినట్లు అధ్యాపకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు కర్నూలు బెటాలియన్‌లో శిక్షణ తీసుకుని రెండవ దశ ఫైరింగ్‌లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఏఎన్‌ఓ కిరణ్, లక్ష్మీనారాయణ, గోవర్ధన్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు భద్రత కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం

ఉరవకొండ : వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డికి భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. గురువారం వజ్రకరూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌కు భద్రతను పెంచడంలో ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యానికి పాపిరెడ్డిపల్లిలో హెలికాప్టర్ ఘటనే నిదర్శనమన్నారు. అంతేగాకుండా అధికార పార్టీ నాయకుల మాటలు, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. 400 కెవి విద్యుత్ లైన్ల మధ్య హెలిప్యాడ్ ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయని విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు గోవిందు, ఓబన్న, ఉస్మాన్, శశాంక్‌రెడ్డి, సర్పంచులు మోనాలిసా, జగదీష్, రవికాంత్‌రెడ్డి, రాకెట్ల బాబు, ప్యాపిలి కిష్ట, భీమా, భరత్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గాడితప్పిన కూటమి పరిపాలన

ప్రజాశక్తి-గుంతకల్లు



విలేకరులతో మాట్లాడుతున్న డి.జగదీష్

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలన గాడి తప్పిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్ విమర్శించారు. గురువారం పట్టణంలోని బిటి పక్కీర ప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ జిల్లా అంతటా మద్యం దుకాణా లు బార్లను తలపిస్తున్నాయన్నారు. ఎక్సైజ్ పోలీ స్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ సిఎం ఆదేశాలను బేఖాతరు చేస్తూ విచ్చలవిడి గా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారన్నారు. రాత్రి 11.12 గంటలైనా మద్యం విక్రయాలు సాగుతున్నాయన్నారు. అంతేగాకుండా అధిక ధరకు విక్రయిస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో పాలన పూర్తిగా గాడిదప్పిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలు, అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాముదాయల్, ఎఐటియుసి మండల అధ్యక్ష, కార్యదర్శులు తలారి సురేష్, ఈశ్వర య్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



తమిళనాడు భక్తులతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దంపతులు

భక్తులకు ఎమ్మెల్యే భోజన వసతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రామేశ్వరం నుంచి కాశీ వరకు పాదయాత్ర చేపట్టిన తమిళనాడు భక్తులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తనవంతు సాయం అందించారు. 120 రోజుల పాటు సుదీర్ఘ పాదయాత్ర చేపట్టిన తమిళనాడు భక్తులు గురువారం అనంతపురానికి చేరుకున్నారు. దీంతో వారికి వారికి అవసరమైన భోజనం, వసతి ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి నాయకులు సింగమనేని రామాంజనేయులు, బోయపాటి రామచంద్ర, దగ్గుపాటి రాజా, వెంకటపతి, లక్ష్మీనారాయణరెడ్డి, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు నివాళి

ప్రజాశక్తి-పామిడి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందిన టిడిపి కార్యకర్తల మృతికి పలువురు నాయకులు గురువారం నివాళు లర్పించారు. ఇందులో భాగంగా టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి వడ్డే శివ మృతదేహానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గుమ్మనూరు ఈశ్వర